# కోటేస్సర్రావ్ - కొత్తబట్టలు

**-శారదా ప్రసాద్**

ఆరోజు ఉదయాన్నే స్నానం చేసి బాత్రూం నించి బయటకొచ్చిన కొటేస్స్రావ్ మంచం మీదున్న తన బట్టల జత చూసి ఇంతెత్తున ఎగిరాడు అతని భార్య స్వరూప మీద.

"రాన్రానూ నీకు ఉన్న మతిపోతోందే రూపా. ఏవిటా షర్టు. ఏవిటా ప్యాంటూ? గులాబీ రంగు షర్టు కింద నీలం రంగు ప్యాంటేసుకుని ఆఫీసుకెళ్లనా? నీ చీరకి మాత్రం మాచింగు మాచింగంటూ జాకెట్టు రంగు నీ చీరమీద చారల రంగుకి కూడా కలవాలంటావు. తేడా వస్తే తీసిపడేస్తావు. నాకేమో జంగిల్ రాజాలాంటి డ్రెస్సేసి రోడ్డుమీదకి పంపిస్తావా?"

"అది కాదండీ. వేరే జతలేవీ లేవిక. ఉంటే తీసి పెట్టనా?" అంది స్వరూప.

"క్రీం కలర్ షర్టుకేమయింది?

"రెండు బటన్లూడిపోయాయి ఆ షర్టుకి. తీస్తాను. పిన్నీసులెట్టుకు తొడుక్కుంటారా?"

"ఛీ.. ఛీ పిన్నులెట్టుకోవడానికది జాకెట్టా? హాఫ్ హ్యాండ్స్ వైట్ షర్టేదీ?"

"కాఫీ పోసుకున్నారు దానిమీద. గుర్తు లేదా? ఉతికి వదిలించలేక ఛస్తున్నా"

"పోనీ, లాల్చీ పైజమా తగలెట్టలేకపోయావా?"

"పైజమాది బొందు లోపలకి పోయింది. బైటకి తీసే టైము లేదిప్పుడు"

తనకున్న జతల లిస్టు అంతా పూర్తవ్వగానే కామైపోయాడు కోటేస్స్రావ్.

"ఏడ్చినట్లే ఉంది. ఆఫీసుకు లీవయినా పడేస్తాను కానీ, ఈ బఫూను డ్రెస్సుతో బైటికెళ్లేది లేదు."

వంటగదిలోంచి రయ్యిన దూసుకొచ్చింది స్వరూప బెడ్రూంలోకి.

"మరో రెండు జతల బట్టలు తీసుకొమ్మని నెత్తీ నోరు కొట్టుకుని పోరుతున్నా, నువ్వెంత అన్నట్టు తీసిపడేస్తారు. ఇప్పుడు అఘోరించండి." దొరికిన వీక్‌పాయింట్‌తో డామినేటింగ్ పొజిషన్‌లోకి వచ్చింది స్వరూప.

"సర్లే గొడవ చెయ్యకు. వచ్చే నెల చూద్దాం" బనీను తొడుక్కుంటూ అందులో మొహం దాచుకున్నాడు కోటేస్స్రావ్ స్వరూప వంటింట్లోకి వెళ్లే వరకు.

***

ఆ రోజు సాయంత్రం భర్త ఆఫీసు నుంచి వచ్చి టీ తాగి రిలాక్సయ్యాక అంది స్వరూప.

"తయారవ్వండి బజారుకెళ్దాం. బట్టలు తీసుకుందురుగాని"

"ఇప్పుడా, నే రాను, డబ్బులేవు"

"నా దగ్గరున్నాయి నడవండి"

"నాకిచ్చేయ్. నే తెచ్చుకుంటా"

"అనవసరం ఖర్చులు చేసి తగలేస్తారు. నేనివ్వను"

"నీ మీద ఒట్టే రూపా. మంచి డ్రెస్సులు తెచ్చుకుంటాను, రేపు ఆఫీసు నుంచి వస్తూ"

"సరే. ముందొక జత తెచ్చుకోండి. మీ తెలివితేటల గురించి, టేస్ట్ గురించి నాకు బాగా తెలుసు" డబ్బులిస్తూ వ్యంగ్యంగా అంది స్వరూప.

***

మర్నాడు సాయంత్రం మహా రద్దీగా ఉన్న బట్టలకొట్టులో దూరాడు కొటేస్స్రావ్.

మిగతా వాళ్లు బిజీగా ఉండి, ఒక నడి వయసు సేల్స్ ఉమెన్ అతని దగ్గరకొచ్చింది "చెప్పండి సార్ ఏం కావాలి" అంటూ.

షర్టు క్లాత్ కోసం ఆమె చేత ఓ పావుగంటసేపు ఎక్సర్‌సైజ్ చేయించాక, మూడు రకాల రంగుల తానులు చేతిలో పట్టుకున్న కోటేస్స్రావ్‌కి ఏది తీసుకోవాలో తోచలేదు.

"మీకంటే చిన్నదాన్నయినా నన్ను చెప్పమంటారా, దేనికంటే ఏ రంగు బావుందో?" తికమకపడుతున్న కోటేస్స్రావ్‌ను చూస్తూ అంది సేల్స్ ఉమెన్.

"చెప్పండి"

"ఆ గ్రీన్ కలర్ కంటే, పసుపు పచ్చ బోర్డరున్న ఈ నల్లరంగు బట్ట బావుంది."

పసుపు బోర్డరుతో నల్లరంగు బట్ట...అస్సలు నచ్చలేదతనికి.

అతను ఆలోచిస్తుండగానే మళ్లీ అందామె.

"మా ఆయన కంటే మీరు ఎత్తు. ఆయన కంటే మంచి పర్సనాలిటీగా ఉన్నారు. మా ఆయన కంటే కూడా మీ ముఖం కళగా ఉంది. మా ఆయన కంటే రంగు కూడా ఎక్కువే. అందుకే ఆ కలర్ కంటే ఈ కలర్ తీసుకోమన్నాను. మీకు నచ్చకుంటే వేరేది తీసుకోండి"

కంటే, కంటే అంటూ వాళ్లాయన్ని నెంబర్ టూలోను, తనను నెంబర్ వన్ ప్లేస్‌లోనూ పెట్టి ఆమె మాటాడగానే ఎండ తగిలిన ఐస్‌క్రీంలా కరిగిపోయాడు కోటేస్స్రావ్.

"బావుంది కట్ చేసెయ్యండి" అన్నాడు హుషారుగా

తానులోంచి బిట్టు కత్తిరించింది సేల్స్ ఉమెన్. ఎంత గుడ్డ కట్ చేసిందీ కూడా కనుక్కోనే ధ్యాసలో లేడప్పుడు కోటేస్స్రావ్.

"మరి ప్యాంటు కుట్టించుకోరా?"

ఆ ఇరవై నిమిషాల సమయంలోనే 'ఆమె'తో తెలియని ఆత్మీయత పుట్టుకొచ్చేసింది కోటేస్స్రావ్‌కి.

"షర్టుకు సరిపడా మాచింగ్ కలర్ చూసి మీరే ఇచ్చేయండి" పూర్తి లైసెన్స్ ఆమెకే ఇచ్చేశాడతను.

"షర్టు కంటే కొంచెం కాస్ట్లీది తీసుకోండి ప్యాంటు బిట్టు" అలా అంటుంటే అచ్చం స్వరూపే తనతో చెపుతున్నట్టుగా ఉంది కోటేస్స్రావ్‌కి.

"అంతా మీ ఇష్టం" గమ్మత్తుగా నవ్వేశాడతను.

అదే హుషారులో షాపు నుండి టైలర్ దగ్గరకు పరిగెత్తాడతను.

టైలరిచ్చిన షాక్ తగిలేవరకూ ఆ హుషారు

తగ్గలేదతనికి.

"ఈ గుడ్డ మీ షర్టుకి చాలదు సార్" కొలిచిన గుడ్డను కుప్పలా పడేస్తూ అన్నాడు టైలరు.

"ఏముంది?"

"ఇంకో ముప్పై సెంటీమీటర్ల గుడ్డ కావాలి."

"విడిగా తేనా?"

"ముక్కలు అతకబెట్టడం కుదరదు సార్. పూరా గుడ్డ కావాలి"

ఆలోచించాడు కోటేస్సర్రావ్.

మరో రెండొందలు ఖర్చు. స్వరూప ఒప్పుకోదు సరికదా.

గుడ్డ వాపసిచ్చేసి డబ్బులు తెచ్చివ్వమంటుంది.

చాలా క్లిష్ట పరిస్థితి ఇప్పుడతనిది. ఆలోచిస్తూ ఇల్లు చేరేసరికి రాత్రి తొమ్మిది దాటింది. షర్టు, ప్యాంటు బిట్లు స్కూటర్ డిక్కీలో రహస్యంగా దాచాడా రాత్రికి.

నోటికొచ్చినట్టు బొంకి స్వరూప క్రాస్ ఎగ్జామ్




## చీమల పెంపకం

ఇదేం వింతో గానీ, బెర్లిన్‌లో ఇటీవల పెంపుడు ప్రాణులపై ఇంట్రెస్టు పెరిగిపోయి చాలామంది చీమల్ని పెంచుకుంటున్నారట. చీమల్ని పెంచుకుంటే అల్లరిచేయవు. కేకలు వేయవు లాంటి లాభాలు కూడా ఉన్నాయని తెగ సంబరపడుతున్నారట బెర్లిన్ ప్రజలు. 'స్టైరిస్టా' అనే యువతి ఏకంగా ఓ చీమల షాపునే ఓపెన్ చేసింది. ఈ షాపులో అందమైన గాజు డబ్బాల్లో రకరకాల చీమలు దొరుకుతాయి. ఈ చీమల కలెక్షన్ చూసి జూ అధికారులు మొదలు కస్టమర్ల వరకూ తెగ సంబరపడిపోతున్నారట. చీమల జాతిని బట్టి వీటి రేటు ఉంటాయి. అద్దాలపెట్టెల్లో, థర్మాకోల్, ఇసుకల మధ్య తిరుగుతూ ఉండే ఈ చీమలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. మనలాంటి వాళ్లం ఈ చీమల్ని ఎలా వదిలించుకోవాలా అని తెగ బాధపడిపోతుంటే బెర్లిన్ ప్రజలు మాత్రం వాటిని కొనడానికి ఉత్సాహపడుతున్నారు.

## 63 సంవత్సరాల గర్భిణీ

నలభై ఏళ్లు దాటితే పిల్లలు పుట్టడం కష్టం అంటారు డాక్టర్లు. కానీ ఇటీవల తమిళనాడులో అరవై మూడేళ్ల ఓ స్త్రీ పిల్లవాడ్ని కని మురిసిపోతుంది. కోయంబత్తూరులో సుబ్రహ్మణ్య దంపతులు 45 సంవత్సరాల పాటు పిల్లల కోసం అల్లాడిపోయారు. పూజలు, వ్రతాలు, పుణ్యక్షేత్రాలు అన్నీ అయ్యాయి. అయినా పిల్లలు కాలేదు. టెస్ట్ ట్యూబ్ బేబీ లాంటిదే అయిన మరో పద్ధతి ద్వారా (యాంటీ రీ ప్రొడక్ట్ టెక్నాలజీ) ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డా ఆరోగ్యంగా ఉండడంతో ఆ దంపతుల ఆనందానికి అడ్డే లేదు.

-శిరీష




నుండి తప్పించుకు బయటపడేసరికి ముచ్చెమటలు పోశాయి కోటేస్వర్రావ్‌కి. స్వరూపనూ వెంటబెట్టుకు వెళ్లవలసింది షాపుకి అని ఒక్క క్షణం అనిపించిందతనికి.

వివరాలన్నీ పూర్తిగా తెలుసుకోనిదే స్వరూప ఏ పనీ చేయదు గాబట్టి తప్పులు జరగవు.

***

మర్నాడు సాయంత్రం చేతిలో షర్టుగుడ్డతో షాపు ఓనరు ముందు నుంచున్నాడు కోటేస్వర్రావ్.

"చెప్పాను కదాసార్. తానులోంచి చింపిన గుడ్డ రిటర్న్ తీసుకోము" పక్కా వ్యాపారస్తుడి గొంతుతో స్థిరంగా చెప్పాడు షాపు ఓనరు.

"మరి నన్నేం చెయ్యమంటారు? మా టైలరు గుడ్డ తక్కువయిందని షర్టు కుట్టలేనంటున్నాడు" దీనంగా అన్నాడు కోటేస్వర్రావ్.

బిజీలో పడి అతని మాటలు విననట్టు నటిస్తున్నాడు షాపు ఓనరు.

"ఎంతసేపిలా నిలబెడతారు? ఏదో ఒకటి చెప్పండి నాకు" అప్పటికే లోపలికి వచ్చేపోయే అయిదారుగురు కస్టమర్లకు దారి ఇవ్వడానికి ఇటు జరిగి అటు జరిగి సర్దుకు నుంచుంటున్నాడు కోటేస్వర్రావ్.

ఇబ్బందిగా ఉందతనికి.

దూరం నుండి అతని అవస్థను చూస్తున్న సేల్స్‌ఉమెన్‌కి జాలేసింది.

అతి నెమ్మదిగా ఓనరు దగ్గరకొచ్చి "సేట్, ఏం జరిగిందంటే, ఆయనకి నిన్న నేనే చింపి ఇచ్చాను ఆ షర్టు పీసు. చిన్నదయిందని అంటున్నారు. పోనీ, మన షాపు టైలరు దగ్గరకి ఆయన్ని పంపించి షర్టు కుట్టిద్దామా?" అన్నది వీణ మీటినంత తియ్యగా.

బారుగా ఉన్న సన్నటి మెడను ఆమెకేసి తిప్పి కళ్లద్దాల్లోంచి కళ్లు పెద్దవి చేసి ఆమెను చూసిన ఓనరుకు కాదనడానికి నోరు రాలేదు.

"లేకే జావో. ఉన్కాపతా ఇన్కో దేదో" అన్నాడు ఇంక చాలించండి ఈ గొడవ అన్నట్టుగా.

బోర్డరు దాటుతున్న కాందిశీకుడిలా రిలీఫ్ ఫీలవుతూ ఆమెతో లోపలికి నడిచాడు కోటేస్వర్రావ్.

షాపు కోసం రెడీమేడ్ జతలు కుట్టే టైలరు ఎడ్రసు, ఫోను నెంబరు రాసిన కాగితం అతనికిస్తూ-

"మీకాగుడ్డ ఎందుకు సరిపోలేదంటే, మా ఆయనకు సరిపడా గుడ్డ కట్ చేసి ఇచ్చాను మీకు పొరపాటున.

కానీ మా ఆయన కంటే మీరు కొంచెం బొద్దుగా ఉన్నారు. సేట్ పంపాడని చెప్పండి మా టైలరుకి. ఆ గుడ్డ సర్ది అందరికంటే బాగా కుట్టిస్తాడు" అంది చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నట్లు ముఖం పెట్టి.

ఎడ్రసు చూసిన కోటేస్వర్రావ్ అదిరిపడ్డాడు.

"అబ్బో, ఇతనుండేది అక్కడా? ఇక్కడ నుండి 30-35 కిలోమీటర్లుంటుంది దూరం" అన్నాడు.

"అంటే కొంచెం దూరమయినా, మీరు మరోసారి ఖర్చు పెట్టి గుడ్డ కొనే కంటే ఇది మంచిదిగా" నచ్చ చెప్పిందామె.

ఇక ఆలస్యం చేయలేదు కోటేస్వర్రావ్. స్కూటర్‌ని లక్ష్యం వేపు దూకించాడు.

ముప్పావుగంట ప్రయాణం తరువాత ఎప్పుడూ తిరగని ఆ కొత్త ప్రదేశం చేరాక టైలరు నెంబరు రింగ్ చేసి సెల్‌ఫోనులో అతనిచ్చే డైరెక్షన్లు వింటూ టైలరు షాపుకు చేరాడు కోటేస్వర్రావ్. రాత్రి ఎనిమిదయింది అప్పటికి.

"నువ్వేనా టైలరు పాషావి?"

"ఔను సార్. రండి కూర్చోండి. అమ్మ షాపు నుంచి ఫోనులో అంతా చెప్పింది. గుడ్డలిచ్చి వెళ్లండి కుట్టిపెడతాను" చాలా వినయంగా చెప్పాడు పాషా.

కోటేస్వర్రావ్‌ని నించో పెట్టి చెస్ట్ కొలత, నడుం కొలత కొలిచి రాసుకుని "ఇక పొండి సార్...వచ్చే వారం ఇదే రోజున రండి" అన్నాడతను.

"మరి మిగతా కొలతలు తీసుకోవా?"

"మీ కొలతలతో మీ జత విడిగా కుట్టడం కుదరదు సార్"

"మరెలా"?

"మీ షర్టు సైజు ఫార్టీటు ఉంది సార్. ప్యాంటు ఫార్టీ. మేము షాపు కోసం కుట్టే ఫార్టీ టు సైజు రెడీమేడ్ షర్టుల లాటులో కలిసి మీ షర్టు, అలాగే ప్యాంటూ కుడతాం సార్"

అయోమయంగా తోచింది కోటేస్వర్రావ్‌కి. "సరే నీ ఇష్టం. పై వారం వస్తా" అంటూ లేచాడతను.

***

ఎదురు చూసిన బుధవారం వచ్చింది. సాయంత్రం లేటుగా వస్తావని స్వరూపకి చెప్పి ఆఫీసుకు బయలుదేరాడు కోటేస్వర్రావ్. ఆ రోజు సాయంత్రం అతను వెళ్లేసరికి షాపులో టైలరు పాషా లేడు.

ఇరవై ఏళ్ల సన్నటి కుర్రాడొకడు కూర్చుని టీవీలో వస్తున్న కాంటా సినిమాలోని పాటలు చూస్తున్నాడు.

"పాషా ఏడీ?" అడిగాడతన్ని

"పాషా లేడు. బైటకి పోయాడు"

"ఇప్పుడొస్తాడా అతను? అతన్తో మాట్లాడాలి"

"క్యా బాత్ కర్నా?"

"నాకు జత కుట్టమని గుడ్డలిచ్చాను"

"ఏం కలర్?"

వివరాలు చెప్పాడు కోటేస్సర్రావ్.

"అసంటియ్ యాడ లేవు. పోపో" అన్నాడు కుర్రాడు టీవీ వేపు తల తిప్పేసుకుంటూ

"సర్గిగ్గా చూడు. లోపలుంటాయ్"

"పో భయ్... అగలా హప్తారా...పోపో" అన్నాడు కుర్రాడు.

"క్లాత్ ఇచ్చి హప్తా అయింది. ఈ రోజు రమ్మన్నాడు పాషా"

అతని మాటలు వినడం లేదా కుర్రాడు.

"పాషాని పిలువ్. నే మాట్లాడతా" నిమిషం గావ్ ఇచ్చాక అన్నాడు కోటేస్సర్రావ్.

"పాషా లేడంటే నీకు సమజైత లేదా? పోపో"

పదే పదే తనను పోపో అనేసరికి ఒళ్లు మండింది కొటేస్సర్రావ్‌కి.

"ఎక్కడికి పోయేది? బట్టలు తీసివ్వు పోతా" కోపంలో వ్యాకరణం తప్పింది వాక్యంలో.

"ఎవరి బట్టలు తియ్యాలి? నడువ్, నడువ్, పోపో" అరిచాడా కుర్రాడు.

"తిన్నగా మాట్లాడు. నీ పేరు చెప్పు. పోలీసు రిపోర్టిస్తా" చట్టం మీద పూర్తి నమ్మకం ఉన్న కోటేస్సర్రావ్ అతన్ని బెదిరించబోయాడు.

"నా పేరా.... జమాలుద్దీన్...ఠాణాకి పోయి షికాయత్ ఇచ్చుకో పోపో" మళ్లీ అరిచాడా కుర్రాడు.

ఇంతలో వచ్చిన పాషా పరిగెత్తుకు వచ్చి ఊరుకో బెట్టాడు ఇద్దరినీ.

"నా బట్టలివ్వు పాషా, ఈ రోజు రమ్మన్నావుగా" చిరాగ్గా అన్నాడు కోటేస్సర్రావ్.

"వచ్చే వారం రండి సార్. కాలర్లు, చేతులు, నడుం ఇంకా రాలేదు" చాలా కూల్‌గా అన్నాడు పాషా.

"అదేంటి? నీకు గుడ్డలిచ్చి వెళ్లానుగా. ఇంకా ఏంటి రాలేదంటావు?"

"మీకు సమజాయిస్తానుగాని, మీకు జరూరుగా కావాలి బట్టలు?"

"నాకివాళే కావాలి?" మొండిగా అన్నాడు కొటేస్సర్రావ్.

"మీకు జల్దీ అయితే ఒక పని చేయండి సారూ."

కాగితం మీద మూడు ఎడ్రసులు రాసి అతని చేతికిచ్చాడు పాషా.

"ఏమిటివి?"

"ఆ పై పతాకెళ్లండి సార్. అక్కడ మీ చొక్కా కాలరు కుట్టిస్తారు. రెండో పతాలో చొక్కా చేతులు కుడతారు.

మూడో పతాకెళితే ప్యాంటుకి నడుం కుట్టిస్తారు. మీ బాడీ, కాళ్లు నా దగ్గరున్నాయ్" అన్నాడు గబగబా.

తల తిరిగింది కోటేస్సర్రావ్‌కి.

"బాడీ ఏమిటి? కాళ్లేమిటి? ఒకచోట కాలరేమిటి? మరో చోట చేతులేమిటి? ఇదంతా నాకర్థం కాలా" అన్నాడతను.

నవ్వొచ్చింది పాషాకి.

"ఇది లాట్లు లాట్లు చొక్కాలు కుట్టడం కదా సార్. అందుకు కాలర్లొక చోట, చేతులు ఒక చోట కుట్టించి తెచ్చి ఇక్కడ బాడీకి అతికి కుడతాం. పాషాకి కాలరే ఇక్కడ కత్తిరిస్తాం. నడుం వేరే చోట నుండి తయారయి వస్తాయి. మీరు జల్దీ అన్నారు కదా సార్.

అందుకే మీ బట్టల పార్టులు ఆ పతాలకెళ్లి అడిగి తెచ్చుకోండి. ఇక్కడ అన్నీ కలిపి కుట్టిస్తా" చెప్పాల్సిందంతా పూర్తయిందన్నట్లు లేచాడు పాషా.

చేతిలో ఉన్న అడ్రసు కాగితం చూస్తే ఆ మూడో ఉత్తర, దక్షిణ, పడమరల్లో ఒక్కొక్కటీ ఉన్నాయి.

తూర్పు నుండి బయలుదేరాడతను. ఏం చెయ్యాలో తోచక నీరసంగా లేచాడతను.

జరిగిందంతా స్వరూపకు చెప్పక తప్పలేదు ఆ రాత్రి కోటేస్సర్రావ్‌కు.

"ఘనకార్యాలు చేస్తారు. నాకు ముందే తెలుసు మీ తెలివితేటలు. అనుభవించండి. వాడెప్పుడు కుట్టిస్తే అప్పుడే తెచ్చుకోండిక" భరత వాక్యం పలికేసింది స్వరూప.

"అసలు పప్పులో ఎక్కడ కాలేశానా" అని గతంలోకి తల దూర్చి కాస్సేపు ఆలోచించాడా రాత్రి కోటేస్సర్రావ్. "మా ఆయన కంటే... మీ కంటే ...ఎందం కంటే... ఆ కలరు కంటే" అన్న "కంటే, కంటే" శబ్దాలు ఆడ గొంతులో లీలగా వినిపించి ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి కోటేస్సర్రావ్‌కి.

★



## అసలు స్వరూపం

సినిమా ఫంక్షన్లు, ఇతర పార్టీల్లోనే తారల అసలు స్వరూపం బయటపడుతుంది. మామూలుగా, రిజర్వ్‌డ్‌గా ఉండే తారలు ఒక్కోసారి రెచ్చిపోతుంటారు. వీరి గురించి బాగా తెలిసినవారు వీరి ప్రవర్తన చూసి ఆశ్చర్యం చెందుతుంటారు. అందాలతార భూమిక మొన్నామధ్య జరిగిన ఓ అవార్డుల ఫంక్షన్లో తెగ ఎంజాయ్ చేసిందిట. స్టార్ స్క్రీన్ అవార్డుల ఫంక్షన్‌కి వచ్చిన భూమిక సయీఫ్ అలీఖాన్‌తో చెట్టాపట్టాలేసుకు తిరిగింది. డెనిమ్ జాకెట్, జీన్స్‌తో ఎంతో డిఫరెంట్‌గా కన్పించింది. ఇంతకిముందుకన్నా ఎంతో హేపీగా కన్పించిన భూమిక గురించే అంతా చర్చించుకుంటున్నారు. ఇంతకీ ఏమైందో ఈ రోజాపువ్వుకి.

